# ఇన్లాండ్ లెటర్ కథలు

## పందెం

కాలేజీ గ్రౌండ్ స్టూడెంట్స్‌తో కళకళలాడుతూ వుంది. జర్రుమని సౌండ్‌తో ఒక హీరోహోండా ఆగింది. ఆ హీరోహోండా మీద బి.కాం రెండవ సంవత్సరం చదువుతున్న ఒక విద్యార్థి వచ్చిఆగాడు అతని పేరు రవికుమార్. అందమైన అమ్మాయిల గ్రూప్ అటుగా వెళుతుంటే రవికుమార్ గ్యాంగ్ కామెంట్స్ విని వారు వెనుదిరిగారు.ఈ రౌడీగ్యాంగ్ కాలేజీలో



అడుగుపెట్టడం పాపం. ప్రిన్సిపల్‌కీ, లెక్చరర్స్‌కి దడ. దీనంతటికీ కారణం ఆ గ్యాంగ్ లీడర్ రవికుమార్. అతడు తన తండ్రికి ఒక్కడే కొడుకు కావడంతో అతని ఆగడాలకు హద్దు లేకుండా పోతుంది. అదే కాలేజీలో చదువుతున్న సునీతను రవికుమార్ ప్రేమించడం మొదలుపెట్టాడు. ఒక రోజు ఎవరూలేని సమయంలో లైబ్రరీని నుంచి వస్తున్న సునీతను తన మనస్సులోని మాటను చెప్పాడు. వెంటనే సునీత కళ్ళల్లో కోపం ప్రస్ఫుటమైంది. కాని వెంటనే తమాయించుకుని వీడితో గొడవ పెట్టుకుని లాభం లేదు అనుకుని ఒక ఉపాయం ఆలోచించింది. నీవు అల్లరి పనులుమాని, కాలేజీలలో మంచి పేరు తెచ్చుకుని లెక్చరర్స్ దగ్గర వినయ విధేయతలు కలిగివుంటే అప్పుడు మంచి వ్యక్తిగా ఇష్టపడతాను. అప్పటివరకు నీ మొహం నాకు చూపించవద్దు అని విసవిసా ఇంటివైపు నడిచివెళ్లిపోయింది. రవికుమార్ ఇంటికివెళ్ళి ఆమె మాటలను గుర్తుతెచ్చుకోసాగాడు. నీలాంటి వ్యక్తిత్వం లేని వ్యక్తిని పెళ్లిచేసుకుని ఏ ఆడపిల్ల సుఖపడగలదు అన్న సునీత మాటలు చెవులలో వినిపిస్తున్నాయి. ఆనాటి నుంచి రవి పనులలో, చేతలలో చాలా మార్పు కనిపించసాగింది. ఈ మార్పును స్నేహితులు ఉపాధ్యాయులు గమనించసాగారు. ఆమె అన్నట్టుగానే అతడు బాగా చదివి మంచి మార్కులతో పాసయ్యాడు. ఆ వార్త ఆ నోటా ఈనోటా విని సునీతకు ఎంతో ఆశ్చర్యం కలిగింది. రవిని అభినందించడానికి సునీత బయలుదేరింది. రవి వెంటనే పశ్చాత్తాపంతో నన్ను క్షమించండి సునీతగారు. ఆరోజు నా స్నేహితులతో మిమ్మల్ని ప్రేమించేలా చేస్తానని పందెం కట్టి మీ వద్దకు వచ్చాను. కానీ ఆరోజు మీ మాటలు నన్ను ఆలోచింపజేశాయి. నాలో ఇప్పుడు అలాంటి భావన లేదు. మనం ఈరోజు నుంచి మంచి మంచి స్నేహితులం అని చెప్పగానే సునీత ఎంతో ఆనందించింది. ఆరోజునుంచి కాలేజ్ గ్రౌండ్ ఏమీ అల్లర్లు లేకుండా ప్రశాంతంగా వుంది.

—యు.సతీష్
బొమ్మూరు

## సంస్కారం

ఆయన మళ్ళీ ఆ కిటికీ దగ్గరికి వెళ్ళి నిలబడ్డారు. బాధతో నిట్టూర్చాను. గత రెండు మాసాలుగా రాత్రివూట భోజనం చేశాక ఆయన దినచర్య యిది. ఓ పది నిమిషాలు అలాగే నిలబడి ఎదురింటి మేడ కిటికీలోంచి కనిపిస్తున్న ఓ అమ్మాయిని చూడటం ఆయనకు కొత్తగా వచ్చిన అలవాటు.



కాదు దురలవాటు. తమ పెళ్ళయ్యాక ఆయన ఎన్నోసార్లు రోడ్డుపై ఎవరైనా అందమైన అమ్మాయి కనిపిస్తే "శైలూ ఆ అమ్మాయి చాలా బాగుంది కదూ" అనడం కద్దు. అయితే ఆయన మాటల్లోగాని, చేష్టల్లో గాని లేకితనం కనిపించేది కాదు. నా భర్త 'సంస్కారి' అని గర్వపడేదాన్ని. ఈ రెండు నెలల్లో ఆయన ప్రవర్తన నా అభిప్రాయాన్ని మార్చివేసింది.

అసలు ఈ మధ్య ఆయనతో మాట్లాడటానికే వీలుకావడం లేదు. మామూలు టైము కంటే ముందే ఆఫీసుకు బయలుదేరుతున్నారు. రాత్రి ఇల్లు చేరేసరికి పన్నెండవుతుంది. ఆలస్యమయ్యిందేమని అడిగితే 'ఓవర్ టైమ్' చేయాల్సి వచ్చిందని చెపుతారు. ఓవర్‌టైమ్ ఆఫీసులో పనివల్లనా, ఆ అమ్మాయితో తిరగడం వల్లనా నాకర్థం కాదు.

"శైలూ! ఇలారా" ఆయన పిలిచారు. కొంపదీసి ఆ అమ్మాయిని తాను ప్రేమిస్తున్నానని, పెండ్లి చేసుకోవడానికి అనుమతి ఇవ్వమని అడగరు కదా. గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఆయన దగ్గరగా వెళ్ళి నిలబడ్డాను.

ఇప్పుడు ఆ అమ్మాయి బాగా కనబడుతూంది. చాలా అందంగా వుంది. కానీ మరీ చిన్న అమ్మాయిలా అన్పిస్తుంది. అయితే ప్రొద్దస్తమానం ఆ కిటికీ దగ్గరే కూర్చుని చదువుకోవడం నాకు నచ్చలేదు.

"శైలూ! ఆ అమ్మాయి ఎవరో తెలుసా" "మీ గర్ల్‌ఫ్రెండ్" మనసులోనే కసిగా అనుకున్నాను. పైకి మాత్రం తెలీదన్నట్టు తల అడ్డంగా ఊపాను.

ఆయన చెప్పడం ప్రారంభించారు.

"ఆ అమ్మాయి నా ఫ్రెండ్ శివం పెదనాన్న కూతురు. ఏడాది క్రితం ఏక్సిడెంట్‌లో ఓ కాలు పోయింది. తనకు జైపూర్ కాలు చేయించమని తండ్రిని కోరింది. కానీ శివం పెదనాన్న రిటైర్డ్ టీచరు. ఉన్న డబ్బులతో పెద్ద కూతురి పెళ్ళికి, ఖర్చు చేసేశారు. నాకు ఆ అమ్మాయికి ఎలాగైనా జైపూర్ కాలు చేయించి బయట ప్రపంచం చూసేలా చేయాలనిపించింది. కానీ మనదీ మధ్యతరగతి బ్రతుకులే. బ్యాంక్‌లో నా సేవింగ్స్ కు మరికొంత డబ్బు చేర్చితే నా ఆశయం నెరవేరుతుంది. అందుకే సిగరెట్లు మానేశాను. ఆఫీసుకు కాలి నడకన వెళ్ళి బస్సు ఛార్జీలు ఆదా చేశాను. ఆఫీసులో ఓవర్ టైము చేశాను. ఈ రోజే ఆ అమ్మాయికి కాలు అమర్చారు. నాకు ఎన్నో 'థాంక్స్' చెప్పి నీకూ చెప్పాలని వుందని, నిన్న తనకు చూపించమంది. ఈ విషయం నీకు ముందే చెప్తే నేను కష్టపడటం ఇష్టం లేక నా ప్రయత్నాన్ని అడ్డుకుంటావని చెప్పలేదు"

ఎంత గొప్ప వ్యక్తి ఈయన. ఆయన ముందు చాలా చిన్నదాన్నా కనిపించాను. అటువంటి సంస్కారిని అనుమానించినందుకు సిగ్గుపడ్డాను.

-సి.ఎస్. చంద్రశేఖర్

**కొత్త రచయితలు మాత్రమే ఇన్లాండ్ కవర్‌మీద కథలు రాసి పంపాలి.**